# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 18 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4


## హైదరాబాద్‌లో భారీ వర్షం

### రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షం పడే అవకాశం

### 12 జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, ఖమ్మం జిల్లాల్లో పలు చోట్ల గురువారం భారీ వర్షం కురిసింది. రాత్రి పది గంటల వరకు జీహెచ్ఎంసీ పరిధిలోని ఉప్పల్‌లో అత్యధికంగా 8.55 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఐదు సెంటీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. సాయంత్రం పూట వర్షంతో రోడ్లన్నీ జలమయం కావడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యి ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు పది జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఆ జాబితాలో కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాలున్నాయి. తెలంగాణ మిగితా 5వ పేజీలో

# నీటి అవసరాలకు స్పష్టమైన రోడ్డు మ్యాప్ ఉంది

- గంజాయి బ్యాచ్ వ్యాఖ్యలు పట్టించుకోం
- కేసీఆర్ తెలంగాణ ద్రోహి
- స్థానికంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం
- లోకేష్‌తో కేటీఆర్ ఎందుకు భేటీ అయ్యారు?
- ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు మానిటరింగ్ చేస్తోంది
- ఢిల్లీ మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో తెలంగాణ భవిష్యత్ నీటి అవసరాల కోసం స్పష్టమైన రోడ్ మ్యాప్ తమదగ్గర ఉన్నదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి తెలిపారు.గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా, గోదావరి బేసిన్‌లో ఉన్నవి, కొత్తగా చేపట్టే ప్రాజెక్ట్ లు, నీటి కేటాయింపులు సహా అన్నింటినీ, ఇకపై నూతన కమిటీ చూస్తుందని తెలిపారు. ఈ కమిటీలో పరిష్కారంకాని అంశాలను సీఎంల స్థాయిలో చర్చిస్తామన్నారు. ఇచ్చంపల్లి–కావేరి వయా శ్రీశైలం నదుల అనుసంధానం అంశం కేంద్రం ప్రతిపాదించిం దని చెప్పారు. 'మేం ఇంజనీర్లం కాదు. రాజకీయ కార్యనిర్వాహకులం. సాంకేతికంగా, చట్టాలు అనుమతిస్తే ముందుకెళ్తాం. భవిష్యత్ అవసరాలు, సమాజంలో మార్పులు, సాంకేతికతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటాం' అని చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ విజయాన్ని సహించలేని వాళ్ళు ఎస్సీ వర్గీకరణ, కుల గణన సర్వేపై కూడా ఇలాంటి విమర్శలే చేశారని గుర్తుచేశారు. కానీ వారి అంచనాలకు మించి అన్నింటినీ విజయవంతంగా చేసి చూపించామని చెప్పారు. కోర్టు ఆదేశాల ప్రకారం సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధం అవుతున్నామని తెలిపారు. దానికోసమే 42 శాతం బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ తెస్తున్నామన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖలు రాయడం కాదనీ, తెలంగాణ అభివృద్ధి అంశాలపై ఎజెండా పెట్టుకొని పిలిస్తే మంత్రులు, అధికారులను పంపిస్తామనీ, అవసరమైతే తాను, డిప్యూటీ సీఎం కూడా వెళ్తామని చెప్పారు. ఇది ఫెడరల్ వ్యవస్థని మేం ముందునుండి చెబుతున్నామనీ, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేయాలని అన్నారు.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ముస్లింలకు రిజర్వేషన్లు ఉన్నాయి. ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్, ఆయన ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్, ఆర్ఎస్ఎస్ స్థాపించిన మహారాష్ట్రలోనూ ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మొదట ఈ మూడు రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లు తొలగించి, కేంద్రమంత్రులు బండి సంజరు, కిషన్‌రెడ్డి తెలంగాణలో రిజర్వేషన్లపై మాట్లాడాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు.

బీఆర్ఎస్ హయాంలో కృష్ణా బేసిన్‌లో ఏపీకి 4.1 టీఎంసీలు ఉంటే, రాయలసీమకు శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా 9.6 టీఎంసీలను మళ్లించారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2004–2014 కాంగ్రెస్ హయాంలో రాయలసీమకు 728 టీఎంసీలు పోతే, 2014–23 వరకు 1,200 టీఎంసీలు తరలించారని గుర్తుచేశారు. కేసీఆర్ తెలంగాణ ద్రోహి అనడానికి ఇది సరిపోతుంది. ఇప్పుడు రాయలసీమకు నీళ్ల ఆపి, శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆపేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుచేస్తున్నట్లా? దీనిపై కేంద్రం, ఏపీతో చర్చకు పోకపోతే, ఎర్రవల్లి ఫాం హౌస్‌కు పోవాలా? అని ఎద్దేవా చేశారు. అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో అప్పట్లో రెండుసార్లు కేసీఆర్, హరీశ్‌రావులు పాల్గొన్నారు. ఇప్పుడు మేం పాల్గొన్నాం.దీంటో తప్పేముంది?

### లోకేశ్‌తో కేటీఆర్ భేటీలో ఆంతర్యమేంటి?

కాగా, నారా లోకేశ్‌ను కేటీఆర్ రహస్యంగా కలిశారని.. అర్ధరాత్రి పూట డిన్నర్ మీట్ పెట్టడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. ఇక కేటీఆర్ నాయకత్వాన్ని ఆయన చెల్లి కవితే ఒప్పుకోవడం లేదని పేర్కొన్నారు. కొడుకు కేటీఆర్‌కు కేసీఆర్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి హోదాను ఇవ్వడం లేదని.. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంటో లేక స్లీపింగ్ ప్రెసిండెంటో తనకు తెలియదని సెటైర్లు వేశారు. ముందు ఆయన కుటుంబం అంతా ఒక తాటిపైకి రావాలని, ఆ తరువాత రాష్ట్ర ప్రజల గురించి ఆలోచించాలని హితవు పలికారు. తనకు మిగితా 5వ పేజీలో

## సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో సెమీకండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ గారికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నూతన ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం, ప్రపంచ స్థాయి పరిశోధన, అభివృద్ధి కేంద్రాల తెలంగాణలో ఉన్నందున ప్రతిపాదిత అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ ప్రాజెక్ట్, మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే ఫ్యాబ్ ప్రాజెక్ట్ క్రిస్టల్ మ్యాట్రిక్స్‌కు ఆమోదం తెలపాలని కోరారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి గారు రైల్ భవన్‌లో అశ్విని వైష్ణవ్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్ పార్క్ ఏర్పాటుకు ఈఎంసీ 2.0 పథకం కింద తెలంగాణ అభ్యర్థనను కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు.

రీజినల్ రింగు రోడ్డు సమీపంలో నూతన ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. తెలంగాణలో రైల్వే అనుసంధానత పెంపు కోసం నూతన ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డుకు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును ప్రతిపాదించామని, ఇందుకు రైల్వే బోర్డు ఇప్పటికే ఫైనల్ లొకేషన్ సర్వేకు అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.రూ.8 వేల కోట్ల విలువైన ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్ట్‌కు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రైలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరగడంతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుతో గ్రామీణ పేదరికం తగ్గడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు.

హైదరాబాద్ డ్రైపోర్ట్ నుంచి బందరు ఓడ రేవుకు అనుసంధానంగా రైలుమార్గం మంజూరు చేయాలని ముఖ్యమంత్రి గారు కోరారు. ఔషధాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తుల ఎగుమతులు, మిగితా 5వ పేజీలో

## నాటో వ్యాఖ్యలపై భారత్ ఆగ్రహం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రష్యాతో ఇంధన ఒప్పందాలపై అభ్యంతరం వ్యక్తం చేసిన నాటో చీఫ్ మార్క్ రుట్టే వ్యాఖ్యలపై భారత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తీవ్రంగా తప్పుబట్టారు. గురువారం ఆయన మాట్లాడుతూ... "మా దేశ ప్రజల ఇంధన అవసరాలే మాకు ప్రథమ ప్రాధాన్యం. ప్రపంచ పరిణామాలను బట్టి, మార్కెట్లో అందుబాటులో ఉన్న వనరులను ఎంచుకోవడం మా హక్కు. ఈ విషయంలో పాశ్చాత్య దేశాలు ద్వంద్వ ప్రమాణాలు పాటించడం సరికాదు" అని హెచ్చరించారు. రష్యాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకునే దేశాలపై వంద శాతం సెకండరీ ఆంక్షలు విధిస్తామంటూ నాటో చీఫ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందానికి రష్యా సిద్ధం కాకపోతే, ఆ దేశ ప్రధాన వ్యాపార భాగస్వాములైన భారత్, చైనా, బ్రెజిల్‌లపై ట్రేడ్ టారిఫ్‌లు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

అమెరికా సెనేటర్లతో సమావేశమైన అనంతరం మార్క్ రుట్టే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇదే దిశగా అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం జూలై తొలి వారంలో రష్యాతో ఆయిల్ ఒప్పందం చేసుకునే దేశాలపై వంద శాతం సెకండరీ టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించిన సంగతి తెలిసిందే. "ఉక్రెయిన్‌తో 50 రోజుల్లో శాంతి ఒప్పందం చేసుకోకపోతే మాస్కో తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటుంది" అంటూ ట్రంప్ తేల్చి చెప్పడం గమనార్హం.

**అమెరికా నుంచి 1,563 మంది భారతీయుల డిపోర్టేషన్**

2025 జనవరి 20న డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన తర్వాత ఇప్పటివరకు సుమారు 1,563 మంది భారతీయ పౌరులను అమెరికా నుండి స్వదేశానికి పంపించినట్టు భారత విదేశాంగ శాఖ గురువారం స్పష్టం చేసింది. వీరిలో చాలా మంది వాణిజ్య విమానాల ద్వారా ఇండియాకు చేరుకున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు.

**వాషింగ్టన్‌లో భారతీయుడి అరెస్ట్‌పై స్పందన**

అమెరికాలోని వాషింగ్టన్‌లో ఒక భారతీయుడిని చైల్డ్ పోర్నోగ్రఫీ కేసులో అరెస్ట్ చేసిన విషయం మీద స్పందిస్తూ జైస్వాల్ మాట్లాడుతూ, "ఇవి ఆయా దేశాల చట్ట, వ్యవస్థా వ్యవహారాలు. విదేశాలకు వెళ్లే భారతీయులు అక్కడి చట్టాలు, నియమాలు పాటించాల్సిందే. అలాగే వారి ప్రవర్తన దేశ ప్రతిష్ఠను ప్రతిబింబించేలా ఉండాలి" అని సూచించారు. ఇదే సందర్భంలో అమెరికాలో షాపింగ్ మాల్‌లో దొంగతనం ఆరోపణలతో అరెస్ట్ అయిన మరో భారతీయ పర్యాటకుడి కేసును ప్రస్తావిస్తూ, "ప్రపంచవ్యాప్తంగా భారతీయులు అక్కడి చట్టాలను గౌరవిస్తూ, మంచి పేరు తెచ్చుకోవాలని మేము ఎప్పటికప్పుడు కోరుతూనే ఉన్నాం" మిగితా 5వ పేజీలో

## బీజేపీ ఎలక్షన్ చోరీ బ్రాంచ్‌గా ఈసీ

### కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ

### బిహార్ ఓటర్ జాబితా సవరణపై తీవ్ర స్థాయిలో విమర్శలు



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

బిహార్‌లో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఓట్లను త్వరగా తొలగిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారంపై గురువారం ఆయన తీవ్ర స్థాయిలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని తప్పుబట్టారు. "ఎలక్షన్ కమిషన్ స్వతంత్ర సంస్థలా కాకుండా, బీజేపీ ఎలక్షన్ చోరీ బ్రాంచ్‌గా మారిపోయింది" అంటూ ధ్వజమెత్తారు. యూట్యూబ్ జర్నలిస్టు అజిత్ అంజుమ్ రూపొందించిన ఓ వీడియో సిరీస్‌ను రాహుల్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. అందులో అధికారులు ఓటర్లకు తెలియకుండానే, వారి సంతకాలు లేకుండానే జాబితాల నుంచి తొలగిస్తున్న దృశ్యాలు ఉన్నాయని తెలిపారు.

ఈ విమర్శల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం స్పష్టతనిచ్చింది. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో మొత్తం 7.89 కోట్ల ఓటర్లలో 6.99 కోట్ల మంది ఇప్పటికే ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించారని వెల్లడించింది. మిగిలి ఉన్నది కేవలం 6.85 శాతం ఓటర్లే అని తెలిపింది. ముసాయిదా ఓటర్ జాబితాను ఆగస్టు 1న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రక్రియలో పాల్గొన్న ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటి వరకు 88.65 శాతం ఓటర్ల వివరాలు సేకరించగా, 1.59% మృతి చెందినట్లు, 2.2% శాశ్వతంగా ఇతర రాష్ట్రాలకు వెళ్లినట్లు గుర్తించారు. అలాగే 0.73% మందికి బహుళ ఓట్లు ఉన్నట్లు వెల్లడించారు.

## చంద్రబాబు కనుసైగలలో కేంద్రం

- -చంద్రబాబు కి తొత్తు రేవంత్ రెడ్డి.
- -చిలుక రేవంత్ రెడ్డి అయితే పలుకులు మాత్రం చంద్రబాబువి
- -తెలంగాణ హక్కులని కాపాడడానికే కేసిఅర్ ఉండు..
- -రేవంత్..మిమ్మల్ని కోర్టుకు లాగుతా
- -నాపై ఏదైనా డ్రగ్స్ కేసు నమోదైందా?
- -బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కేంద్ర ప్రభుత్వం చంద్రబాబు కనుసైగల్లో నడుస్తుందని, చంద్రబాబుకి తొత్తుగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నాడని, చిలుక రేవంత్ రెడ్డి అయితే పలుకులు మాత్రం చంద్రబాబువి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం సిరిసిల్లలో కౌంటర్ అటాక్ చేశారు.

అరు దశాబ్దాలుగా జరిగిన జలదోపిడి ఒక ఎత్తు అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కోవర్ట్ గా మారి ఢిల్లీ లో తెలంగాణ ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టారని అన్నారు.బనకచర్ల గురించి చర్చ అయితే పోను అన్న, సి ఎం రేవంత్ రెడ్డి మీటింగ్ కి ఎలా పోయిండని, బనకచర్ల పై కాంగ్రెస్ ప్రభుత్వం స్టాండ్ మార్చకపోతే మరొసారి ఉద్యమానికి బిఅర్ఎస్ సిద్దం అవుతుందని అన్నారు.కాళేశ్వరం, సితారామ ప్రాజెక్టు లకి అనుమతులు ఇవ్వోద్దని అడ్డుకున్నదే చంద్రబాబు నాయుడు అని అన్నారు.కాంగ్రెస్ ఎమ్మెల్యే నే చంద్రబాబు కోవర్టులా పాలన జరుగుతుందని చెప్పాడని అన్నారు.

అదిత్యనాథ్ సాగునిటి సపహాదారుడుగా పెట్టుకోవడమే పెద్ద తప్పు అని అన్నారు. ఇచ్చంపల్లి ప్రాజెక్టు గతంలో ఉన్న ప్రాజెక్టే అని,

గోదావరి జలాల విషయం లో తెలంగాణ కి ఇంకా న్యాయం జరగాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఎలాంటి అనుమతులు లేకుండానే బనకచర్ల ప్రాజెక్టు కట్టాలని చూస్తున్నారని,రేవంత్ రెడ్డి గురుదక్షిణ చెల్లించాలని చుస్తున్నాడని,సిఎం రేవంత్ కి ఏ బేసన్ లో ఏ ప్రాజెక్టు ఉందన్న విషయం తెలియదని, తెలిసింది రియల్ ఎస్టేట్ వ్యాపారమే అని అన్నారు.

కేసిఅర్ రాయలసీమ,ఆంధ్రా కూడా బాగుండాలని, మావాట తెలాలని కోరారని,తెలంగాణ హక్కులని కాపాడడానికే కేసిఅర్ ఉండు అని అన్నారు.

మా గొడవ ఆంధ్రా ప్రజలతో కాదు అని,మా హక్కు,మా వాట తెలాలని అడుగుతున్నాంమని అన్నారు.కన్నెపల్లి లో మోటర్లు అన్ చేయకుండా కరువుచాయలు ఉండవు అని, అన్నారు. రేవంత్ రెడ్డి మీడియా చిట్ చాట్ పేరుతో నా పైన, ఇతరుల పైన విషయం చిమ్మడం ఇదే మొదటిసారి కాదు అని,కేవలం ముఖ్యమంత్రి కార్యాలయానికి గౌరవం ఇచ్చి ఇప్పటివరకు సంయమనం పాటించానని అన్నారు.డ్రగ్స్ కేసులో నాపై విచారణ జరుగుతుందని,రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకి ఆధారం ఏమిటో చెప్పాలని, నాపైన ఏమైనా కేసు నమోదు అయిందా, కనీసం అనువంత రుజువైన ఉన్నదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి దమ్ముంటే దొంగ చాటుగా చేసిన వ్యాఖ్యలపై,ఆధారాలు బయటపెట్టాలనీ, లేకుంటే తాను చేసింది చౌకబారు, చిల్లర వ్యాఖ్యలు అని ఒప్పుకోవాలని అన్నారు.

హైదరాబాదులో నాతో ముఖాముఖి చర్చకు వచ్చే దమ్ము లేక ఢిల్లీ వరకు ప్రయాణం చేసి మరి రేవంత్ రెడ్డి నాపై బురద జల్లుతున్నాడని అన్నారు. కేవలం చట్టం పరిధి నుంచి న్యాయస్థానాల పరిధి నుంచి తప్పించుకోవడానికే ముఖ్యమంత్రి చిట్ చాట్ ల పేరుతో దొంగచాటు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు.పిరికి దద్దమ్మలా చిట్ చాట్ ల పేరుతో నా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నాడని, అయితే వీటన్నింటినీ ఇకపై సహించేది లేదని అన్నారు.రేవంత్ రెడ్డి చేసిన అసత్య పూరిత, దురుద్దేశపూర్వక నిందలకు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి తాను చేసిన నిరాదార ఆరోపణలకు వెంటనే క్షమాపణ చెప్పాలని అన్నారు. ఇలా వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సీఎంకు కొత్తకాదు. రేవంత్‌రెడ్డి.. మిమ్మల్ని కోర్టుకు లాగుతా. తప్పుడు ఆరోపణలకు మూల్యం చెల్లించుకోక తప్పదు. సీఎం క్షమాపణ చెప్పకపోతే పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని కేటీఆర్ అన్నారు.



## సింగూరు డ్యామ్ నుంచి నీటి విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సింగూరు డ్యామ్ నుంచి మంత్రి దామోదర రాజనర్సింహ నీటిని విడుదల చేశారు. సింగూరు ఎడమ కాలువ నుంచి సాగు కోసం 100 క్యూసెక్కుల నీటిని మంత్రి విడుదల చేశారు. రెండు పంటల క్రాప్ హాలిడే తర్వాత నీటిని విడుదల చేశారు. సింగూరు ఎడమ కాలువ మరమ్మతుల నేపథ్యంలో రెండు పంటలకు అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించారు. రైతులు పంట సాగుకు ఇబ్బందుల దృష్ట్యా మంత్రి దామోదర్ రాజనర్సింహ నీటిని విడుదల చేశారు.

## హార్టికల్చర్ డిప్లొమా కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

### జూలై 19న నిర్వహణ

### కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు అవకాశం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

2025–26 విద్యా సంవత్సరానికి కొండ లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జూలై 19న (శనివారం) స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య తెలిపారు.

ఇప్పటికే దరఖాస్తు చేసిన 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తాము కలిగిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో జూలై 19న ఉదయం 10 గంటలలోపు ములుగులోని యూనివర్సిటీ పరిపాలన భవనానికి హాజరుకావాలన్నారు. దరఖాస్తు చేయని విద్యార్థులకూ ఇదే రోజు, అదే సమయానికి ఒరిజినల్స్‌తో ప్రత్యక్షంగా హాజరు కావచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 7780509322, 7683053157 నెంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.ఉద్యానశాస్త్రంలో డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పుష్కల ఉపాధి అవకాశాలు ఉన్నాయని డా. సైదయ్య తెలిపారు. హార్టికల్చర్ విస్తీర్ణం పెరుగుతుండటం, ఉత్పత్తులకున్న ఆదరణ, మార్కెట్లో ఉద్యాన పంటల చక్కటి డిమాండ్%ఖ్శ్రీశ్రీ% కలిసి ప్రశిక్షణ పొందిన మానవ వనరులకు మంచి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయని వివరించారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత యువతకు ఇది మంచి అవకాశం. డిప్లొమా అనంతరం హార్టిసెట్ ద్వారా నేరుగా బీఎస్సీ హార్టికల్చర్ డిగ్రీ కోర్సులో చేరవచ్చు. అలాగే విత్తన, ఎరువులు, పురుగుమందుల కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

## గురుకులంలో ఫుడ్‌పాయిజన్..

### 30 మంది విద్యార్థినులకు అస్వస్థత

### జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్‌లో ఘటన


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జగిత్యాల జిల్లాలోని లక్ష్మీపూర్ మండలంలోని గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం విషపూరిత మవడంతో 30 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. భోజనం చేసిన కొద్ది సేపటికే వాంతులు, కడుపునొప్పి వంటి లక్షణాలతో విద్యార్థినులు ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో, పాఠశాల సిబ్బంది హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వెంటనే చికిత్స ప్రారంభించినప్పటికీ, కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఇప్పటికీ ఆసుపత్రిలో విద్యార్థినులకు వైద్యం కొనసాగుతోంది. విద్యార్థినుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఘటనపై ప్రతిపక్షాలు ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తున్నాయి. గతంలో పలు దఫాలు ఇలాగే మధ్యాహ్న భోజన వ్యవస్థపై విమర్శలు వచ్చినా, చర్యలు తీసుకోకుండా సర్కారు తలదాచుకుంటోందని మండిపడుతున్నారు. "విద్యార్థుల జీవితం గాలిలో దీపంలా మారుతోంది. ప్రభుత్వం నిద్రలేచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అని కోరుతున్నారు.

ఈ ఘటనపై స్పందించిన జిల్లా విద్యా శాఖ అధికారులు – ఆహారం శాంపిల్స్‌ను పరీక్షించేందుకు పంపించామని, పూర్తిగా వివరాలు రిపోర్టు వచ్చిన తర్వాత వెల్లడిస్తామన్నారు. బాధితులందరికీ తగిన వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

## ఆకాశ్ ప్రైమ్ ప్రయోగం విజయవంతం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశీయంగా అభివృద్ధి చేసిన వైమానిక రక్షణ వ్యవస్థ 'ఆకాశ్ ప్రైమ్'ని భారత సైన్యం లద్దాక్‌లో విజయవంతంగా ప్రయోగించింది. ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేసిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) సీనియర్ శాస్త్రవేత్తల సహకారంతో ఆర్మీ వైమానిక దళం ఈ పరీక్షను నిర్వహించిందని సీనియర్ అధికారి గురువారం ప్రకటించారు. తూర్పు లద్దాక్‌లో 15,000 అడుగుల ఎత్తులో రెండు రోజుల పాటు ఈ పరీక్షను నిర్వహిం చారని తెలిపారు. ఎత్తైన వాతావరణంలో వేగంగా కదులుతున్న వైమానిక లక్ష్యాలపై ఆకాశ్ ప్రైమ్ రెండు ప్రత్యక్ష దాడులు చేపట్టిందని అన్నారు. మొదట దీనిని ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రయోగించారని, ఫలితాలు బాగున్నాయని అధికారి తెలిపారు. ఆకాశ్ ప్రైమ్‌లో వాతావరణం, భూభాగంతో సంబంధం లేకుండా మెరుగైన కచ్చితత్వాన్ని సాధించేందుకు స్వదేశీ యాక్టివ్ రేడియో ఫ్రీక్వెన్సీ (ఆర్ఎఫ్) స్పీకర్‌ను అమర్చారు. ఇది మధ్యస్థ–శ్రేణి రక్షణ వ్యవస్థ. ఉపరితలం నుంచి గగనతలానికి క్షిపణులను ప్రయోగించడంతో పాటు మొబైల్, సెమీ మొబైల్, స్థిరమైన సైనిక స్థావరాలను వైమానిక దాడుల నుంచి రక్షిస్తుంది. దీనిని 4,500 మీటర్ల ఎత్తులో కూడా ప్రయోగించవచ్చు. సుమారు 25–30 కి.మీ దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు.

### మహిళల ఆర్థిక స్వాతంత్ర్యమే

## లింగ సమానత్వానికి మార్గం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### నిజాం కళాశాలలో వుమెన్ కమిషన్ సదస్సు

వివరాలు 5వ పేజీలో

# రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదు..

- పతి కార్యకర్తకు నేను అండగా ఉంటా
- ఇబ్బందులు పెట్టిన పేర్లు రాసుకుంటున్న..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతోషంగా లేరని,ఎన్నికల ముందు కాంగ్రెసోళ్ల కుడా గేలుస్తామని అనుకోలేదు, అనుకోకుండా వచ్చిన అధికారంతో వాళ్ళు ఆగం అయితున్నారని, మనల్ని ఆగం చేస్తున్నారని బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో సిరిసిల్ల నియోజకవర్గం లోని ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాల పార్టీ కార్యకర్తల, నాయకులు ప్రజాప్రతినిధుల తో స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై నాయకులకు దిషానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ ఆర్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు పెట్టాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతున్నదని,ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల దుకాణాల ముందు చెప్పులు పెట్టీ క్యూలో నిల్చునే రోజులు మళ్ళీ వచ్చాయని అన్నారు.వ్యవసాయం పై కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపారని,నారుమళ్ల వైస్ సమయానికి ఎరువులు సిద్ధం ఉండేవి అని అన్నారు.కేసీఆర్ ఉన్నప్పుడు మన వాగులో నిండుగా నీళ్ళు ఉంటే, ఇప్పుడు ఎడారిని తలపిస్తుందని అన్నారు.



కొండ పోచమ్మ సాగర్ వద్ద 618 మీటర్ల ఎత్తుకు నీళ్ల తెచ్చిండు కేసీఆర్ అని అన్నారు.ఒక్కో మోటార్ 139మెగావాట్ల బాహుబలి మోటార్లతో ఎత్తిపోతల ద్వారా మనకు నీటి సరఫరా వ్యవస్థ ను కెసిఆర్ తయారు చేసిండని అన్నారు.కేసీఆర్ ఇచ్చిన హామీల లో ఒకటికి రెండింతలు ఇస్తామని,అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు , మెదక్ లో ఓ నాయకుడు ఏకంగా 48 గంటలు కరెంటు ఇస్తా హామీ ఇచ్చాడని అన్నారు.అధికారం ఎవరికి శాశ్వతం కాదు,నేను సిరిసిల్లకు వస్తే చాలా సంతోషపడతాను,

ఒక్క రూపాయి పైసలు పంచకుండా, ఒక్క మందు చుక్క పోయకుండా గెలవడం నాకు గర్వంగా ఉంది, ఇది నేను, మీరు అందరం గర్వపడే విషయం అని అన్నరు.పరిపాలన పరంగా ఇక్కడ జరిగిన అభివృద్ధి చరిత్రాత్మకం అని,2001 నుండి ఇప్పటివరకు మనకు సిరిసిల్ల లో ఏ ఎన్నికైన తిరుగులేదని అన్నారు.ప్రతి కార్యకర్తకు నేను అండగా ఉంటా,మన ఎంపీటీసీ కుంటయ మరణం నన్ను తీవ్రంగా బాధించింది, వారికి కుటుంబ బాధ్యత నేను తీసుకున్న అని అన్నారు.ప్రజలంతా కేసీఆర్ నాయకత్వం కోసం ఎదురు చూస్తున్నారని, ఇటువంటి పనికిమాలిన నాయకులు ఉంటారని తెలిస్తే బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో ప్రభుత్వాన్ని రీకాల్ చేసే అంశం పెడుతుండే అని అన్నారు.ఎవ్వరికి భయపడేది లేదు, మనల్ని ఇబ్బంది పెడుతున్న అందరి పేర్లు రాసిపెట్టుకుంటున్న,మన పార్టీ నుండి పోయిన నాయకులు, ఎమ్మెల్యేలు మళ్ళీ వస్తానంటూ రాయభారం చేస్తున్నారు,వాళ్ళని తీసుకోవద్దని కేసీఆర్ ఖరాఖండిగా చెప్పారని అన్నారు.

ప్రతి ఎంపిటీసీ , జడ్పీటీసీ, అన్ని స్థానాల్లో మనమే గెలవాలని,రాష్ట్రంలోని 269 జడ్పీటీసీ స్థానాల్లో మనం గెలవబోతున్నామని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ప్రజాశక్తి కి భయపడాల్సిందే అని,కాంగ్రెస్ లో ముఖ్యమంత్రి స్థానం కోసం పోటీ నడుస్తుందని,బ్యాలెట్ బాక్స్ లో తెరిస్తే కాంగ్రెసోళ్ల గుండెలు దడ దడ లాడాలని అన్నారు. నాయకులు పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేసి విజయాన్ని సొంతం చేసుకోవాలని,అధికార పార్టీకి ధీటుగా పని చేద్దామని అన్నారు. మన ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు అనేక అవార్డులు వస్తె నేడు ఒక్క అవార్డు దిక్కులేదనిఅన్నారు.బిసి రిజర్వేషన్లపై బీసీ సోదరులను మళ్ళీ కాంగ్రెస్ మోసం చేస్తుందని, పార్లమెంట్ లో రాజ్యాంగ సవరణ చేస్తేనే ఇది సాధ్యమవుతుందని అన్నారు.బండి సంజయ్ బిసి రిజర్వేషన్ల నుండి ముస్లింలను తీసేయాలంటాడని, ఎంత సేపు మత విద్వేషాలు లేపడం తప్ప బండి సంజయ్ చేసింది ఏమి లేదని, రాష్ట్రంలో మనమే ప్రధాన ప్రతిపక్షం , బిసి డిక్లరేషన్ పై మనమే అందరికీ అవగాహన కల్పించాలని అన్నారు.అసెంబ్లీ ఎన్నికల లో మీరు నాకోసం పని చేసింద్రు , ఇప్పుడు మీ గెలుపు కోసం నేను పనిచేస్తా అని అన్నారు. ఇక్కడ నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ రామారావు, పలు మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ హక్కులు కాలరాస్తున్న సీఎం

- ఇలాంటి నాన్ సీరియస్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి
- ఢిల్లీ మీటింగ్ లో మొదట చర్చించిందే బనకచర్ల మీద
- గోదావరి జలాలను చంద్రబాబుకు గిఫ్ట్ గా ఇచ్చిండు
- బనకచర్ల, బీసీ రిజర్వేషన్ల మీద ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**బలగం టీవీ, హైదరాబాద్**

రేవంత్ రెడ్డి తెలంగాణ హక్కులను కాలరాస్తున్నాడని.. ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి గోదావరి నీళ్లను చంద్రబాబు గిఫ్ట్ గా ఇచ్చారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. గురువారం బంజారాహిల్స్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, ఢిల్లీ మీటింగ్ లో బనకచర్లపై అసలు చర్చే జరగలేదని రేవంత్ రెడ్డి బుకాయించారని అన్నారు. ఢిల్లీ మీటింగ్ లో మొదట చర్చ జరిగిందే బనకచర్ల మీద అని తనకు స్పష్టమైన సమాచారం ఉందన్నారు. రేవంత్ రెడ్డి నాన్ సీరియస్ ముఖ్యమంత్రి అని, తెలంగాణ హక్కులను కాలరాస్తోన్న ఆయనకు పదవిలో



కొనసాగే అర్హత లేదన్నారు. వెంటనే రేవంత్ సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

తన స్కూల్ బీజేపీ, కాలేజీ టీడీపీ, ఉద్యోగం కాంగ్రెస్ లో అని సీఎం చెప్తుంటారని.. ఇంకా కాలేజీలోనే ఉన్నాననుకొని చంద్రబాబుకు గోదావరి నీళ్లను కట్టబెట్టారని అన్నారు. ఢిల్లీ మీటింగ్ లో శాలువాలు కప్పుకొని సన్మానం చేయించుకొని రేవంత్ రెడ్డి బలికా బక్రా అయ్యారని.. ఆయన ఏం అయినా నష్టం లేదు కాని ఇక్కడ బలి అయ్యేది తెలంగాణ ప్రయోజనాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ మీటింగ్ లో నాలుగు విజయాలు సాధించానని రేవంత్ చెప్పుకుంటున్నారని.. అందులో ఏ ఒక్క అంశం కూడా కొత్తది కాదన్న విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. టెలిమెట్రీ స్టేషన్లు ఇదివరకే ఉన్నాయని.. కేఆర్ఎంబీ ఏపీలో ఉండాలన్నది విభజన చట్టంలోనే ఉందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల హక్కులను రేవంత్ రెడ్డి చంద్రబాబు కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టుతో ఏపీ ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. తెలంగాణలోని తుపాకులగూడెం నుంచి నదుల అనుసంధానం చేపడితే రెండు రాష్ట్రాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మేఘా ఇంజనీరింగ్ కంపెనీ ఇచ్చే కమీషన్ల కోసమే రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అన్నారు. చంద్రబాబుకు రేవంత్ సద్దిమోస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ జాగృతి పక్షాన న్యాయపోరాటం చేసి బనకచర్లను ఆపితీరుతామన్నారు.

బనకచర్లపై చర్చించేందుకు ఢిల్లీకే వెళ్లనని చెప్పిన రేవంత్ రెడ్డి.. కేంద్ర మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్ అఫీషియల్ మీటింగ్ కు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. చంద్రబాబు ఎజెండాలో భాగంగానే రేవంత్ ఢిల్లీ పర్యటనకు వెళ్లారని అన్నారు. ఒకవేళ ప్రభుత్వం బనకచర్లపై సరైన రీతిలో చర్యలు తీసుకోకుంటే కలిసివచ్చే పక్షాలతో ఢిల్లీలో పోరాటం చేస్తామన్నారు. ఈనెల 21 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయని.. బనకచర్లతో పాటు బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.కొప్పుల ఈశ్వర్ స్వయంగా బొగ్గుగని కార్మికుడని, ఆయనకు టీబీజీకేఎస్ బాధ్యతలు అప్పగించడాన్ని స్వాగతిస్తున్నానని అన్నారు. ఒక ఎమ్మెల్సీని జనాభా లెక్కల నుంచి తీసేశానని.. ఆయన ఎవరో తనకు తెలియదన్నారు. ఆయన గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంలో కన్నీరు పెడుతున్న రైతన్నలు

- రైతు పై సోయి లేని ప్రభుత్వం... కాంగ్రెస్ ప్రభుత్వం
- రాజన్న సిరిసిల్ల జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు
- నీటి విడుదల కోసం పొత్తూర్ బ్రిడ్జి పై రైతుల ధర్నా

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

కాంగ్రెస్ ప్రభుత్వం లో రైతన్నలు నీటి కోసం కన్నీరు పెడుతూ రోడ్డు పై బైఠాయించే పరిస్థితి తీసుకు వచ్చారని రాజన్న సిరిసిల్ల జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు మండిపడ్డారు. గురువారం మండలంలోని పొత్తూర్ మా నేరు బ్రిడ్జి పై రైతులు నీటి విడుదల కోసం ధర్నా కార్యక్రమం చేపట్టగా ఆయన మద్దతు తెలిపారూ. అనంతం ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ అంటే అప్పుడు రైతులు కోరగానే మిడ్ మానేరు జలాశయం నుండి రైట్ కెనాల్ ద్వారా నీటి విడుదల చేసి పంట పొలాలకు పుష్కలంగా నీళ్ళు ఇచ్చేవాళ్ళమని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో నీరు అందాక నారు మడులు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా స్థానిక శాసనసభ్యులు స్పందించి నీటిని విడుదల చేసి రైతు ను ఆదుకోవాలని లేకపోతే రైతులు కాదు తమ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు,పలు గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు



## వరుణిడి కరుణ కోసం ప్రత్యేక పూజలు

**అన్నపూర్ణ ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో వానలు పడేందుకు కప్ప తల్లి ఆటలు**

**బలగం టీవీ,బోయినిపల్లి**

జూలై మూడవ వారంలో కూడా వర్షాలు కురియడం లేదు.వర్షాల కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. తొలకరి పలకరించినా.. తరువాత వర్షాలు ముఖం చాటేశాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండలో గురువారం రోజున అన్నపూర్ణ ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో రైతులు వరుణుడికి జలభి షేకం చేశారు. పిల్లలు, పెద్దలు కలిసి గ్రామాల్లో కప్ప తల్లి ఆట ఆడుతూ పాడుతూ వర్షాలు సమృద్ధిగా కురువాలని గ్రామ దేవత పోచమ్మ ఆలయం నుండి గ్రామంలో దేవాలయాలలో కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ కుల సంఘ పెద్దలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉపసర్పంచ్ లు, మాజీ వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## నీటి ఎద్దడి నివారణ చర్య కోసం ఎంపీ నిధుల నుండి బోరు మంజూరు..

**బలగం టీవీ, బోయినిపల్లి:**

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ చొరవతో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని కొదురుపాక గ్రామంలో గ్రామ ప్రజల నీటి సమస్యను తొలగించడానికి బోరు మంజూరు చేశారు.కొదురుపాక గ్రామ ప్రజలు, మంత్రి బండి సంజయ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు ఎడపల్లి పరశురాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహాచారి, కొనుకటి హరీష్ బూత్ అధ్యక్షులు సారంపల్లి రాజు, తిరుపతి, రాజు, శేఖర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# రైతులకు అండగా ప్రాథమిక సహకార సంఘం

- **ఇల్లంతకుంట ప్యాక్స్ చైర్మన్ గొడుగు తిరుపతి**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

రైతులకు ప్రాథమిక సహకార సంఘం అన్ని రకాలుగా దోహదపడుతుందని , రైతులు రుణాలను పొంది అభివృద్ధి చెందాలని ఇల్లంతకుంట ప్యాక్స్ చైర్మన్ గొడుగు తిరుపతి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నీ సహకార సంఘం లో దీర్ఘకాలిక, స్వల్ప కాలిక ఋణాలను 13 మంది రైతులకు 86 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఈ ఓ చిట్టి రవీందర్ రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు

# గంజాయి కేసులో ఇద్దరు అరెస్ట్

- **రిమాండ్ కి తరలింపు..**
- **250 గ్రాముల గంజాయి రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం**
- **అక్రమంగా గంజాయి సేవించిన క్రయ విక్రయాలు జరిపిన కఠిన చర్యలు తప్పవు**
- **వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్**



**బలగం టీవీ, బోయినిపల్లి**

సి.ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సుల్తానాబాద్ కి చెందిన వేముల శ్రీనివాస్,వేముల విజయలక్ష్మీ అనే భార్యాభర్తలు మహారాష్ట్రలోని చంద్రపూర్ నుండి గంజాయి కొనుగోలు చేసి, గంజాయికి అలవాటు పడిన వారికి ఎక్కువ ధరలకు అమ్ముతూ వాటితో జల్సాలు చేస్తుండేవారని తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో గ్రానైట్ కార్మికులకు ఎక్కువ రేటుకు గంజాయి అమ్ముతున్నారన్నారు. అందులో భాగంగా బుధవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోరేం గ్రామ శివారుకి వస్తున్నారన్న సమాచారం మేరకు బోయినిపల్లి ఎస్.ఐ రాజకుమార్ తన సిబ్బందితో అక్కడికి వెళ్లగా అనుమానాస్పదముగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా, వారివద్ద 250 గ్రాముల గంజాయి,రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని తెలిపారు. అక్రమంగా గంజాయి సేవించిన, క్రయవిక్రయాలు జరిపిన, కఠిన చర్యలు తప్పవని ఈసందర్భంగా హెచ్చారించారు. యువత డ్రగ్స్ భారినపడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి జిల్లాలో స్పెషల్ డ్రైవ్ లు, నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు నిర్వహిస్తూ, అక్రమ గంజాయి రవాణాపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపుతున్నారని తెలిపారు. జిల్లాలో గంజాయికి సంబంధించిన సమాచారం సంబంధిత పోలీస్ వారికి సమాచారం అందించి గంజాయి రహిత జిల్లాగా మర్చడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు.

# జూలై 21 నుంచి రిలే నిరాహార దీక్షలు



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**


బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామ అసంపూర్తిగా ఉన్న హై లెవెల్ వంతెన పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ, జూలై 21 సోమవారం నుండి రిలే నిరాహార దీక్షలు చేయనున్నారు. ఈ మేరకు గురువారం మండలం కేంద్రంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ "స్తంభంపల్లి గ్రామంలో ఉన్న గంజి వాగు వద్ద సంపూర్తిగా ఉన్న హై లెవెల్ వంతెన వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మరియు చొప్పదండి శాసనసభ్యులు స్వయంగా జూలై 9న బ్రిడ్జి పనులను సందర్శించి వెంటనే ప్రారంభిస్తామని చెప్పి ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది.కానీ నేటికీ పది రోజులు గడుస్తున్న మరియు దాదాపుగా 14 నెలల నుండి అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న పనులు చేయడంలో జాప్యం చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పాదయాత్ర చేసిన, బైక్ ర్యాలీ చేసిన మరెన్నో గ్రామ ప్రజలు ఆందోళన కార్యక్రమాలు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. కాబట్టి ఈనెల 20వ తారీకు లోపు వెంటనే జాప్యం చేయకుండా పనులు మొదలు చేయాలని, లేని పక్షంలో అఖిలపక్ష సమావేశంలో తీర్మానం చేసినట్టుగా 21వ తారీకు నుండి బోయినిపల్లి మండల కేంద్రంలో రిలే నిరహార దీక్షలు చేయడం కోసం తీర్మానించడం జరిగింది. కావున రెండు నియోజకవర్గాలకు ప్రధానమైనటువంటి రోడ్డు అసంపూర్తిగా ఉండటం వల్ల ప్రజలకు నిత్యం ఇబ్బందులు గురవుతున్నారు. కాబట్టి మండల ప్రజలందరూ కూడా 21 సోమవారం నుండి జరిగే నిరాహార దీక్షలలో పాల్గొని విజయవంతం చేయాలి" అని మండల ప్రజలకు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, బిజెపి సీనియర్ నాయకులు బొంగాని అశోక్ గౌడ్, సిపిఎం మండల కార్యదర్శి గురజల శ్రీధర్, తాజా మాజీ సర్పంచుల జే.ఏ.సీ రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపల్లి కరుణాకర్,బిఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి తిరుపతి, బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, బీఎస్పీ జిల్లా నాయకులు అల్వాల అజయ్ తదితరుల పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యం

**-పారిశ్రామికవేత్తలుగా మహిళలు ఎదగాలి**

**-మహిళల పేరు మీదే రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల జారీ**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ, వేములవాడ:**

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, మహిళలు ఆర్థిక అభివృద్ధి తోనే దేశ ప్రగతి సాధ్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.. గురువారం వేములవాడ పట్టణంలో డిఆర్డిఏ, షేర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై,మహిళల సమైఖ్య సంఘాలకు వడ్డీ లేని రుణాలు, బ్యాంక్ లింకేజి, ఇటీవల మరణించిన మహిళా సంఘ సభ్యుల ప్రమాద బీమా చెక్కులను వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో ముందుకు పోతున్నారని,అందులో భాగంగా రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తద్వారా మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సంకల్పించారని అన్నారు.

అనాడు ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మేలు జరిగితే మళ్లీ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మహిళా తల్లిలకు పేద్దపీఠ వేయడం జరుగుతుందని అన్నారు..గతంలో వైఎస్ పావలా వడ్డీకే రుణాలు మంజూరు చేశారని, ఐకేపీ కేంద్రాలను ప్రారంభం చేసి మహిళలకు ఆర్థిక స్వావలంబన దిశగా ప్రోత్సాహం అందించాలని అన్నారు.ప్రజా ప్రభుత్వంలో మహిళలకు 20వేల పైచిలుక కోట్లను కేటాయించడం జరిగిందని అన్నారు.

గత ప్రభుత్వం మహిళా సంఘంలను ఏ మాత్రం పట్టించుకోలేదని చివరికి మూడు సంవత్సరాల వడ్డీని ఎగ్గొట్టినరని,మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు, పెట్రోల్ పంప్, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్ వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరు మీద మంజూరు చేస్తుందని అన్నారు.

గత పాలకుల హయాంలో నిర్లక్ష్యం చేసిన వడ్డి లేని రుణాలను ప్రజా ప్రభుత్వంలో పునరుద్ధరించామని అన్నారు.. 93 లక్షల పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.

25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల జమ చేశామని అన్నారు. రైతు భరోసా క్రింద పెట్టుబడి సహాయం ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచి 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయల జమ చేశామని, రైతు బీమా కు 3 వేల కోట్ల అందించామని అన్నారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలో ఐకెపి నుండి గత సీజన్ లో 63 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 177 కోట్ల విలువగల 763877 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు కే చేయడం జరిగిందని తద్వారా జిల్లా మహిళా సమైక్య సంఘాలకు 17 లక్షల,48 గ్రామ ఐక్య సంఘాలకు 1 కోటి 55 లక్షల కమీషన్ రావడం జరిగిందని అన్నారు..

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు వారు ఆర్థికంగా ఎదగాలని మైక్రో ఎంటర్ప్రైజేషన్, మహిళా శక్తి స్టిచ్చింగ్ సెంటర్స్, ఈవెంట్ మేనేజ్మెంట్ యూనిట్లో, సోలార్ పవర్ ప్లాంట్, డైరీ యూనిట్స్ వంటి వాటిని ఎర్పాటు చేయడం కోసం బ్యాంకు లింకేజీ వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందని అన్నారు...

వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో అయ్యప్ప, శ్రీ ఆదర్శ గ్రామ సంఘాలకు సంబంధించి నాలుగు ఎకరాల భూమిలో నాలుగు కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు,36 లక్షలతో మహిళా సమైక్య సంఘానికి ఆర్టిసి బస్సు కొనుగోలు చేసి అందజేయడం జరిగిందని అన్నారు..

2024 25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు లింకేజీ ద్వారా 20084 కోట్లు, 2025-26 సంవత్సరానికి 58 కోట్లు బ్యాంకు లింకేజీ అందజేయడం జరిగిందని,4350 సంఘాలకు 5 కోట్ల 72 లక్షల వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందని అన్నారు..

మహిళా సంఘాల సభ్యురాళ్లకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన లోన్ బీమా, ప్రమాద బీమా స్కీం వలన ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.. ప్రమాదవశాత్తు ఎవరైనా సంఘ సభ్యులు చనిపోతే వర్ తీసుకున్న రుణం మాఫీ తో పాటు పదిలక్షల వరకు ఇన్సూరెన్స్ చెల్లించడం జరుగుతుందని అన్నారు...

లోన్ బీమా,ప్రమాద బీమా వంటి పథకాలను గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆలోచించ లేదని అన్నారు.ఇప్పటివరకు వేములవాడ నియోజకవర్గంలో 37 మందికి 40.43 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు.. వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని పేర్కొన్నారు.. రానున్న రోజుల్లో ప్రభుత్వానికీ ఆశీర్వాదాలు అందజేయాలని పిలుపునిచ్చారు.. డిఆర్డిఏ శేషాద్రి, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలకల తిరుపతి, కచకాయల ఎల్లయ్య,అన్ని మండల ఏపీఎంలు, మహిళా సమైక్య సంఘ అధ్యక్షురాలు,మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు..

# ఆయిల్ పామ్ సాగుతో మంచి ఆదాయం..

- **ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్..**
- **బోయినిపల్లి మండలం మర్లపేట గ్రామంలో ఆయిల్ పామ్ తోటలను పరిశీలన..**



**బలగం టీవీ, బోయినిపల్లి**

రైతులు ఆయిల్ పామ్ సాగు ద్వారా ఏడాదికి లక్షా యాభై వేల రూపాయల వరకు నికర ఆదాయం పొందవచ్చని ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి. శేఖర్ తెలిపారు. బోయినిపల్లి మండలం మర్లపేట గ్రామంలో ఆయిల్ పామ్ తోటలను ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. ఈ పంటతో మంచి ఆదాయం పొందవచ్చు. ప్రతి రైతుకు కేవలం రూ.20కే మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఎకరాకు రూ.4,200 వరకు సబ్సిడీ మంజూరవుతోంది," అని వివరించారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై కూడా విస్తృత రాయితీలు అందుతున్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీ మరియు చిన్నకారు రైతులకు 90 శాతం, ఓసీలకు 80 శాతం సబ్సిడీ లభించనుందని చెప్పారు."మన జిల్లాలో నీటి వనరులు, నేల తేమ అందుబాటులో ఉన్నాయి. ఆయిల్ పామ్ పంటకు ఇవి అనుకూలంగా ఉంటాయి. కాబట్టి రైతులు ముందుకు వచ్చి ఈ సాగు చేపట్టాలి," అని శేఖర్ రైతులకు పిలుపునిచ్చారు. అనంతరం ఆయిల్ పామ్ గెలల కోతను పరిశీలించిన ఆయన, పంట దిగుబడి, మార్కెట్ అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతుల ఆర్థిక స్థితిలో విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి లత మాట్లాడుతూ.. మన జిల్లాకు ఈ సంవత్సరం ఆయిల్పామ్ సాగు లక్ష్యం 2000 ఎకరాలు, అయితే ఇప్పటికే పెద్ద ఎత్తున రైతులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి లోకేష్, గోవర్ధన్, ఏఓ ప్రణీత, ఫ్రీ యూనిక్ కంపెనీ జిల్లా మేనేజర్ ప్రేమ్ సాయి, ఆయిల్పామ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, ఏఈఓ, తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# తొక్కిసలాటకు ఆర్సీబీనే కారణం

- ఘటనకు ఆర్సీబీ యాజమాన్యమే బాధ్యత వహించాలి
- ఆర్సీబీ విజయోత్సవ ర్యాలీ తొక్కిసలాటపై కర్ణాటక ప్రభుత్వ సంచలన నివేదిక



**బలగం టీవీ, బెంగళూరు**

ఐపీఎల్‌లో తొలి టైటిల్ గెలుచుకున్న అనంతరం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఈ విషాద ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 50 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై కర్ణాటక ప్రభుత్వం హైకోర్టుకు సమర్పించిన నివేదికలో కీలక విషయాలు వెలుగుచూశాయి. తొక్కిసలాటకు ఆర్సీబీ యాజమాన్యమే ప్రధాన కారణమని ప్రభుత్వ నివేదికలో పేర్కొనడం సంచలనంగా మారింది. విజయోత్సవ పరేడ్‌కు సంబంధించి పోలీసులతో సంప్రదించకుండానే యాజమాన్యం ఏకపక్షంగా పెద్ద ఎత్తున అభిమానులను ఆహ్వానించిందని ఆరోపించింది.

"ఈవెంట్‌కు ముందు అనుమతుల కోసం యాజమాన్యం దరఖాస్తు చేయలేదు. కేవలం సమాచారం మాత్రమే ఇచ్చింది. ఇది స్పష్టమైన నిర్వాహక లోపం" అని నివేదికలో పేర్కొంది. ఆర్సీబీ అధికారిక ఎక్స్ ఖాతాలో ఉచిత ప్రవేశంతో చినస్వామి స్టేడియంలో పరేడ్ నిర్వహించనున్నట్లు ప్రకటించడంతో 3 లక్షల మందికి పైగా అభిమానులు తరలివచ్చారు. కానీ స్టేడియంలోని సామర్థ్యం కన్నా ఇది చాలా ఎక్కువ. ఈవెంట్‌లకు కనీసం ఏడు రోజుల ముందే అనుమతులు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. నిర్వాహకుల తడికలు, ముందస్తు ప్రణాళికల కొరత వల్లే ఈ విషాద ఘటన చోటుచేసుకుందని నివేదిక తెల్పింది.

అయితే ఈ నివేదికను గోప్యంగా ఉంచాలని చేసిన రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. దీనిలో గోప్యతకు ఎలాంటి చట్టపరమైన ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేస్తూ నివేదికను బహిరంగంగా విడుదల చేసింది.




## అంతర్జాతీయ క్రికెట్‌కు ఆండ్రే రస్సెల్ వీడ్కోలు

**బలగం టీవీ, హైదరాబాద్**

వెస్టిండీస్ సీనియర్ ఆల్‌రౌండర్ ఆండ్రే రస్సెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. 37 ఏళ్ల రస్సెల్.. తన సొంత మైదానమైన జమైకాలోని సబినా పార్క్ వేదికగా ఆస్ట్రేలియాతో తొలి రెండు టీ20 మ్యాచ్‌లు ఆడనున్నాడు. ఆ తర్వాత అతను అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకోనున్నాడు. అతని స్థానంలో మాథ్యూ ఫోర్డేకి జట్టు లో స్థానం కల్పించారు. తదుపరి మూడు మ్యాచ్‌లకు సెంట్ కిట్స్ అండ్ నెవిస్ వేదికగా జరగనున్నాయి.

ఇప్పటి వరకు రస్సెల్ వెస్టిండీస్ తరఫున 84 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 1,078 పరుగులు, 61 వికెట్లు నమోదు చేశాడు. 2012, 2016 టీ20 ప్రపంచకప్ విజేత జట్లల్లో అతడు సభ్యుడిగా ఉన్నాడు. గ్లోబల్ లీగ్‌లలో 561 మ్యాచ్‌లు ఆడి 9,316 పరుగులు (స్ట్రైక్‌రేట్ 168.31) సాధించడమే కాకుండా.. 485 వికెట్లు పడగొట్టాడు.

"వెస్టిండీస్ జెర్సీ ధరించి ఆడటం నా జీవితంలో గర్వకారణం. చిన్నప్పుడే అంతర్జాతీయ స్థాయికి వెళ్లగలనని ఊహించలేదు. కానీ క్రికెట్‌పై ప్రేమ పెరిగే కొద్దీ సాధించగలిగే స్థాయిని గుర్తించా. నా ఆటతో మరొకరికి స్ఫూర్తిగా ఉండాలనేదే నా లక్ష్యం" అని రస్సెల్ భావోద్వేగంగా స్పందించాడు."ఇకపై నా ఇంటి మైదానంలో, నా కుటుంబం, అభిమానుల సమక్షంలో అంతర్జాతీయ కెరీర్‌కు గొప్ప ముగింపు ఇవ్వాలనుకుంటున్నాను" అని పేర్కొన్నాడు.

### రస్సెల్‌కు శుభాకాంక్షలు తెలిపిన డారెన్ సమ్మీ

రస్సెల్‌పై వెస్టిండీస్ కోచ్ డారెన్ సమ్మీ ప్రశంసల జల్లు కురిపించారు. "ఆండ్రే అత్యుత్తమ నిష్టతో, పోరాటపు తత్త్వంతో ఆడే ఆటగాడు. నేను కెప్టెన్‌గా ఉన్నప్పుడూ, ఇప్పుడు కోచ్‌గా ఉన్నప్పుడూ.. అతని తపన మారలేదు. క్రికెట్‌కు చరిత్రగా మిగిలే ఆటగాడిగా రస్సెల్ నిలిచాడు" అని సమ్మీ అన్నారు.

### విండీస్ టీ20 జట్టులో కొత్తవారికి అవకాశం

ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌కు 16 మంది సభ్యులతో కూడిన జట్టును విండీస్ క్రికెట్ బోర్డు బుధవారం (జూలై 16) ప్రకటించింది. ఇందులో తొలిసారిగా జెడైయా బ్లేడ్స్, జువెల్ ఆండ్రూ జట్టులోకి వచ్చారు. 18 ఏళ్ల ఆండ్రూ.. గత అక్టోబర్‌లో వన్డేల్లో అరంగేట్రం చేసి ఆపై స్పిన్నర్లపై ధాటిగా ఆడుతూ సెలక్టర్లను ఆకట్టుకున్నాడు. వికెట్ కీపర్‌గా కూడా సేవలందించగలడు. మరోవైపు బలమైన పవర్‌ప్లే బౌలర్‌గా పేరున్న ఎడమచేతి పేసర్ జెడైయా బ్లేడ్స్.. గతేడాది డిసెంబరులో బాంగ్లాదేశ్‌తో వన్డేల్లో అరంగేట్రం చేశాడు. ఇతర కీలక ఆటగాళ్లుగా అఖీల్ హొసేన్, జేసన్ హోల్డర్, రోవ్‌మన్ పవెల్ లాంటి అనుభవజ్ఞులూ జట్టులో ఉన్నారు.

## థీమ్ ఆఫ్ పరదా విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**


'యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతాః' ఋగ్వేదంలోని స్త్రీని విశ్వశక్తిగా గుర్తించారు. అయితే, తర్వాతి కాలంలో స్త్రీ ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొందో చెప్పేందుకే 'పరదా' సినిమా వస్తుంది. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. వనమాలి రిచించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి ఆలపించారు. గోపీ సుందర్ సంగీతం అందించారు. అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రధారిగా, సంగీత, దర్శనా రాజేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రాన్ని 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. ఆగష్టు 22న ఈ చిత్రం విడుదల కానున్నట్లు మేకర్స్ ప్రకటించారు.




## సెన్సార్ బోర్డు వ్యవహారంపై విమర్శలు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఫిలింల సర్టిఫికేషన్ విషయంలో సెన్సార్ బోర్డు తీసుకుంటున్న స్టాండ్‌పై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మలయాళ చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'కి సంబంధించి సెన్సార్ బోర్డు అభ్యంతరాలు వ్యక్తం చేయడం ఈ వివాదానికి కేంద్ర బిందువైంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర పేరు జానకి అని ఉండటాన్ని బోర్డు వ్యతిరేకించింది. అది సీతాదేవి పేరుతో అనుబంధం ఉందని, ఆ పేరును మార్చాలని సూచించినట్లు తెలుస్తోంది. దీంతో సినీ ప్రముఖులు బోర్డును తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటి శ్రేయ ధన్వంతరి, టాలీవుడ్ దర్శకుడు తరుణ్ భాస్కర్ సహా అనేకమంది సోషల్ మీడియా వేదికగా తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ప్రముఖ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ ఈ అంశంపై స్పందిస్తూ, "కథలు రాసేటప్పుడు పురాణాల నుంచి పేర్లు పెట్టకూడదంటే అర్థం లేదని. బతికున్నవారి పేర్లు పెట్టలేకపోతే, పాత్రలకు XYZ, ABC, 123 అనే పేర్లు పెట్టాలా?" అని ప్రశ్నించారు.




## 'మై బేబి' ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

తమిళంలో విమర్శకుల ప్రశంసలు, ప్రేక్షకుల ప్రశాంత స్పందనతో విజయవంతమైన 'డీఎన్ఏ' చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను 'మై బేబి' పేరుతో అలరించడానికి సిద్ధమైంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత సురేష్ కొండేటి తన ఎస్‌కె పిక్చర్స్ బ్యానర్‌పై జూలై 18న థియేటర్లలో విడుదల చేయబోతున్నారు. గతంలో 'ప్రేమిస్తే', 'జర్నీ', 'షాపింగ్ మాల్', 'పిజ్జా' లాంటి సక్సెస్‌ఫుల్ రీమేక్‌లను అందించిన ఆయన, మరో ఆసక్తికర కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. నెల్సన్ వెంకట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నిమిషా సజయన్, అథర్వ మురళి జంటగా నటించారు. విడుదలకు ముందురోజు చిత్రం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ట్రైలర్‌ను బట్టి చూస్తే ఇది హాస్పిటల్ మాఫియా నేపథ్యంలో సాగే మానసిక థ్రిల్లర్‌గా కనిపిస్తోంది. సురేష్ కొండేటి ఈ చిత్రానికి మంచి ప్రమోషన్ ఇవ్వడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. జూలై 18న థియేటర్లలో 'మై బేబి' విడుదల కానుంది.


## రామ్ రాసిన ప్రేమ పాట ప్రోమో

- నేడు పూర్తి పాట విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా, దర్శకుడు మహేష్ బాబు పీ తెరకెక్కిస్తున్న 'ఆంధ్ర కింగ్' సినిమాలోని మొదటి సింగిల్ 'నువ్వుంటే చాలే' ప్రోమోను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటకు సాహిత్యం రామ్ స్వయంగా రచించారు. సంగీతద్వయం వివేక్‌అండ్ మార్విన్ అందించిన ఈ మెలోడీని పాపులర్ సింగర్ అనిరుధ్ రవిచందర్ ఆలపించారు. పాట ఫుల్ వెర్షన్‌ను జూలై 18న(నేడు) విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.







## నేడు ఓటీటీలోకి రాబోయే సినిమాలు ఇవే..

**బలగం టీవీ, హైదరాబాద్**

శుక్రవారం రెండు తెలుగు సినిమాలు ఓటీటీకి రావడానికి సిద్ధంగా ఉన్నాయి. ఒకటి 'కుబేర' అయితే, రెండోది 'భైరవం'. 'కుబేర' సినిమాకి శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించాడు. సీబీఐ ఆఫీసర్ గా నాగార్జున .. బిచ్చగాడిగా ధనుష్ నటించిన సినిమా ఇది. కీలకమైన పాత్రలో రష్మిక కనిపించగా, జిమ్ సర్భ్ విలన్ గా టాలీవుడ్ కి పరిచయమయ్యాడు. శేఖర్ కమ్ముల ఈ కథలో ఒక కొత్త పాయింట్ ను టచ్ చేశాడనీ, నాగార్జునతో ఒక డిఫరెంట్ రోల్ చేయించాడనే టాక్ వచ్చింది. ఈ సినిమా 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ కానుంది.ఇక ఇదే రోజున 'జీ 5'లో 'భైరవం' స్ట్రీమింగ్ కానుంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ .. మంచు మనోజ్ .. నారా రోహిత్ ప్రధానమైన పాత్రలను పోషించగా, వారి సరసన అదితి శంకర్ .. ఆనంది .. దివ్యపిళ్లై నటించారు. విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన ఈ సినిమాకి, శ్రీచరణ్ పాకాల సంగీతాన్ని సమకూర్చాడు. మే 30వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, 'జీ 5' ద్వారా పలకరించనుంది.

**టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించాడు. టెస్ట్, వన్డే, టీ20 మూడు ఫార్మాట్లలో 900 కంటే ఎక్కువ ఐసీసీ రేటింగ్ పాయింట్లు సాధించిన తొలి క్రికెటర్‌గా రన్‌మెషీన్ నిలిచాడు. తాజాగా ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌ను అప్డేట్ చేయడంతో కోహ్లీ టీ20 రేటింగ్ పాయింట్స్ 897 నుంచి 909కి పెరిగాయి. అతనికి టెస్టుల్లో 937, వన్డేల్లో 909 రేటింగ్ పాయింట్స్ ఉన్నాయి. ఇక, ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో విరాట్ వరుసగా 1202 రోజులు అగ్రస్థానంలో నిలిచాడు. క్రికెట్ చరిత్రలో ఏ ఆటగాడూ సాధించని రికార్డు ఇది. 2018లో అత్యధిక పరుగులతో కోహ్లీ ఒకేసారి టెస్టులు, వన్డేలు, టీ20ల్లో నంబర్ వన్ ఐసీసీ ర్యాంక్ బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. ఇంతకుముందు ఈ ఘనతను ఆసీస్ స్టార్ క్రికెటర్ రికీ పాంటింగ్ మాత్రమే సాధించాడు.**

# మహిళల ఆర్థిక స్వాతంత్రమే లింగ సమానత్వానికి మార్గం

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**నిజాం కళాశాలలో వుమెన్ కమిషన్ సదస్సు**



**బలగం టీవి, హైదరాబాద్**

మహిళలకు ఆర్థిక స్వాతంత్రం కల్పించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, ఆర్థిక బలోపేతం ద్వారానే లింగ బేధాన్ని నిర్మూలించగలమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. శుక్రవారం నిజాం కళాశాలలో వుమెన్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లింగ సమానత్వం సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. "కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం. మొదటి ఏడాదిలోనే రూ.21,632 కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేశాం" అని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా 2000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రచించిందని వివరించారు.

"ఈ దేశంలో మహిళలకు లభించిన ఆత్మగౌరవం, వరకట్న నిషేధం, తల్లిదండ్రుల ఆస్తిలో వాటా వంటి హక్కులు అన్నీ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే సాధ్యమయ్యాయి" అని భట్టి స్పష్టంగా పేర్కొన్నారు. స్వాతంత్రం ముందు మహిళలకు మేటర్నిటీ లీవ్ లాంటి హక్కులు లేవని, స్వాతంత్రం అనంతరం రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాలకు హక్కులు లభించాయన్నారు. "రాజ్యాంగాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది" అని డిప్యూటీ సీఎం బలంగా అభిప్రాయపడ్డారు.

**మహిళల కోసం వినూత్న పథకాలు**

ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ద్వారా మహిళలపై ఆర్థిక భారం తగ్గిందని

650 బస్సులు మహిళా సంఘాల పేరుపై కొనుగోలు చేసి, ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే విధంగా ప్రభుత్వ ప్రణాళిక ఉందని

అమ్మ క్యాంటీన్లు, గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకులు, ఇళ్ల మంజూరులో మహిళలకు ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.

**నిజాం కళాశాలపై గర్వంగా ఉంది : డిప్యూటీ సీఎం**

"నిజాం కళాశాల గొప్పదాన్ని నేను పూర్వ విద్యార్థిగా గర్వంగా చెప్పుకుంటున్నాను" అని డిప్యూటీ సీఎం భావోద్వేగంతో అన్నారు. "1980ల్లో నేను రూమ్ నంబర్ 36లో ఉండి చదివాను. మా సహచరులు ఇప్పటి వరకు సైంటిస్టులుగా స్థిరపడి ఉన్నారు" అని గుర్తు చేశారు. కళాశాలలో ఉన్న సమస్యలన్నీ సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని, ఒక రోజు విద్యార్థిగా నిజాం కళాశాలలో గడపాలని ఆకాంక్షించారు.

# గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది

**-అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాల అమలు..**

**-నూతన రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ,వేములవాడ,**

ధనిక రాష్ట్రం తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని, ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత పాలకుల హయంలో ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం వేములవాడ పట్టణంలో గల మహా లింగేశ్వర గార్డెన్స్ లో వేములవాడ రూరల్, అర్బన్ మండలానికి చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని అన్నారు. పేద ప్రజలకు రేషన్ కార్డు ఒక గుర్తింపు కార్డు గా మారిందని, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు రేషన్ కార్డు తో పాటు గత ఉమ్మడి రాష్ట్రంలో 2 లక్షల రూపాయల ఆరోగ్యశ్రీ కార్డు అప్పటి ప్రభుత్వం అందించిందని, ప్రస్తుతం మన ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డు పొందిన ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుందని అన్నారు.పేద ప్రజలు అనారోగ్యంతో బాధపడితే కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ క్రింద చికిత్స పొందే అవకాశం లభించిందని అన్నారు. నేడు వేల సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి అర్హులకు రేషన్ కార్డులను మంజూరు చేయడంలో కృషిచేసిన అధికారులకు ప్రభుత్వ విప్ అభినందనలు తెలిపారు.

రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సరఫరా చేయడం ఉగాది నుంచి ప్రారంభించామని, దీనితో రేషన్ కార్డ్ ప్రాముఖ్యత గణనీయంగా పెరిగిందని అన్నారు. రేషన్ కార్డు పొందిన లబ్ధిదారుల్లో భవిష్యత్తులో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి వారిని పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహిస్తు న్నామని అన్నారు. మహిళా సంఘాలలోని మహిళలకు 10 లక్షల రూపాయల ప్రమాద బీమా, 2 లక్షల రూపాయల లోన్ బీమా కల్పించామని అన్నారు. పెట్రోల్ బంక్, ఆర్టిసి కు అద్దె బస్సుల ఏర్పాటు, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు అనేక రంగాలలో స్వయం సహాయక మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నామని, ఆదానీ , అంబానీ లకు పోటీగా మన మహిళలు వ్యాపారాలు చేస్తున్నారని అన్నారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించామని అన్నారు.ఆరోగ్య శ్రీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి పథకాలను కొనసాగిస్తూ అదనంగా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ వేములవాడ అర్బన్ మండలంలో 353, రూరల్ మండలంలో 174 నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, వీటి ద్వారా దాదాపు 3,000 మంది పేదలకు అదనంగా రేషన్ అందుతుందని అన్నారు. ప్రజల జీవనంలో రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్ , ఆధార్ కార్డు, కరెంట్ కనెక్షన్ , ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందని అన్నారు.

సిరిసిల్ల జిల్లాలో నూతనంగా 14 వేల లబ్దిదారులకు రేషన్ అందించేందుకు కార్డులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి లబ్ధిదారుడికి నెలకు అదనంగా 6 కిలోల సన్న బియ్యం రేషన్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. నూతన రేషన్ కార్డు ద్వారా ఇందిరమ్మ ఇండ్లు, ఫించన్ వంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో వేములవాడ కమిటీ మార్కెట్ చైర్మన్ రాము, డిఎం సివిల్ సప్లై రజిత తాసిల్దార్లు , లబ్ధిదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

(మొదటి పేజీ తరువాయి)

డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం గురువారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 384 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. 6 ప్రాంతాల్లో భారీ వర్షం, 161 ప్రాంతాల్లో మోస్తరు వర్షం(6.43 సెంటీమీటర్ల నుంచి 1.6 సెంటీమీటర్ల వరకు) కురిసింది.

| | |
|---|---|
| **ఉప్పల్ (జీహెచ్ఎంసీ)** | **8.55 సెంటీమీటర్లు** |
| **వేంసూరు(ఖమ్మం)** | **8.30 సెంటీమీటర్లు** |

# నీటి అవసరాలకు స్పష్టమైన రోడ్డు మ్యాప్ ఉంది

(మొదటి పేజీ తరువాయి)

ఎవరితో ఎలాంటి శతృత్వాలు.. వైరుధ్యాలు లేవని.. కేసీఆర్ కేవలం తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని రేవంత్ అన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసును రాష్ట్ర హైకోర్టు సుమోటోగా తీసుకొని మానిటరింగ్ చేస్తోందని సీఎం చెప్పారు. గతంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా తన ఫోన్ ట్యాప్ అయిందన్న కిషన్‌రెడ్డి ఇప్పటి వరకు ఎందుకు ఫిర్యాదు చేయలేదో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రస్తుతం ఈ కేసులో కేసీఆర్‌ను కాపాడేందుకే కేంద్రానికి ఫోన్ ట్యాపింగ్ కేసు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. 'కేంద్ర విదేశాంగ శాఖ, ఇతర శాఖల వల్లే ఈ కేసులో కీలక నిందితుడు ప్రభాకర్‌రావును తీసుకురా వడంలో ఏడాదిన్నర ఆలస్యమైందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును కేంద్రానికి అప్పగించాలని కోరుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణలో కీలక కేసులన్నీ ఈడీకి అప్పగిస్తే ఏం చేసిందని ప్రశ్నించారు. గొర్రెల స్కీం, ఈ ఫార్ములా రేసు సహా ఇతర కేసులన్నింటిని ఈడీ దర్యాప్తు చేస్తోందన్నారు. ఈ కేసులకు సంబంధించి అడిగిన అన్ని వివరాలను కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించామని చెప్పారు. అయినా ఇప్పటికీ కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. కాళేశ్వరం ఇంజనీర్ల అక్రమ సంపాదన ఏంటనేది ఏసీబీ దాడులతో ప్రజలకు అర్థమవుతున్నదని అన్నారు. కొట్లాట నా చివరి అస్త్రం. ఇదే ధోరణిలో కేంద్రం, పొరుగు రాష్ట్రం ఏపీతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాం. కొట్లాడుకుంటూ పోతే ప్రజలకు నష్టం. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని ఆ వివరాలు వెల్లడించారు.

**గంజాయి బ్యాచ్‌కు నేను స్పందించాలాకో?**

కేటీఆర్‌ది గంజాయి బ్యాచ్. ఆ బ్యాచ్ సవాల్ విసిరితే నేను స్పందించాలా? అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'కేటీఆర్ బిజినెస్ భాగస్వామి కేదార్ రకరకాల డ్రగ్స్ ఒకేసారి తీసుకొని దుబాయ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన ఫోరెన్సిక్ రిపోర్ట్‌ను తెప్పించాం. త్వరలో బయట పెడతాం. కేటీఆర్ బామ్మర్ది ఫాంహౌజ్‌లో గంజాయి, డ్రగ్స్‌తో దొరికాడు. ఇలా కేటీఆర్ చుట్టు పక్కన ఉన్న వాళ్లంతా గంజాయి బ్యాచ్చే.. టెస్టుల కోసం రక్తం, జుట్టు ఇస్తా అని సవాల్ విసిరిన కేటీఆర్ మాటమార్చి కోర్టుకు పోయి ఆర్డర్స్ తెచ్చుకున్నాడు అని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్ మా రాజకీయ ప్రత్యర్థి, ఆయన ప్రతిపక్ష నేతగా చేయాల్సింది చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ వస్తే ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధం'. అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

2014కు ముందు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ కల్పిస్తే, దాన్ని 23 శాతానికి తగ్గించింది కేసీఆరే అని ఆరోపించారు. బీజేపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు కే లక్ష్మణ్‌కే ఈ బిల్లు, ఆర్డినెన్స్‌పై అవగాహన లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం త్వరలో మహారాష్ట్రకు వెళ్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తుమ్మిడి హట్టి ప్రాజెక్ట్ కోసం మహారాష్ట్రలో పర్యటిస్తాననీ, అక్కడి ప్రభుత్వంతో మాట్లాడతామనీ అన్నారు.

# భాగ్యలక్ష్మి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి కోమటిరెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**

బోనాల పండుగ ఉత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని చార్మినార్ వద్దగల భాగ్యలక్ష్మి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రిని ఆలయ ట్రస్టీలు శశికళ సూర్యప్రకాష్ బుధవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

# సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి

(మొదటి పేజీ తరువాయి)

పలు దిగుమతులకు ఈ మార్గం దోహదపడుతుందని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో రైల్వే ఆపరేషన్స్‌ను మరింత సమర్థంగా నిర్వహించేందుకు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి గారు విజ్ఞప్తి చేశారు. ప్రయాణికులకు భద్రత, వేగవంతమైన సేవలు అందించేందుకు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

తెలంగాణలో వివిధ ప్రాంతాల అనుసంధానత, పారిశ్రామిక, వ్యవసాయక ఎగుమతులు, దిగుమతుల కోసం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నూతన రైలు మార్గాలకు సంబంధించి పలు ప్రతిపాదనలను అందించారు. ఇందులో భాగంగా వికారాబాద్ – కృష్ణా (122 కిలోమీటర్ల అంచనా వ్యయం రూ.2,677 కోట్లు), కల్వకుర్తి – మాచర్ల (100 కిలోమీటర్ల అంచనా వ్యయం రూ.2 వేల కోట్లు), డోర్నకల్ – గద్వాల (296 కిలోమీటర్ల అంచనా వ్యయం రూ.6,512 కోట్లు), డోర్నకల్ – మిర్యాలగూడ (97 కిలోమీటర్ల అంచనా వ్యయం 2,184 కోట్లు) మార్గాలను వంద శాతం రైల్వే శాఖ వ్యయంతో మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గారిని కోరారు. సేమావేశంలో ఎంపీలు పోరిక బలరాం నాయక్ , సురేశ్ కుమార్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి , కుందూరు రఘువీర్ రెడ్డి , రామసహాయం రఘురాం రెడ్డి గారు ఉన్నారు.

# నాటో వ్యాఖ్యలపై భారత్ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

అని జైస్వాల్ పేర్కొన్నారు. ఇతరంగా, బహ్రైన్ క్రౌన్ ప్రిన్స్ సల్మాన్ బిన్ హమద్‌తో జరిగిన ద్వైపాక్షిక భేటీలో ట్రంప్ మాట్లాడుతూ, భారత్‌తో త్వరలో కొత్త వాణిజ్య ఒప్పందం జరుగే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చారు. "మేము భారత మార్కెట్ లోకి ప్రవేశించేందుకు సిద్ధంగా ఉన్నాం. గతంలో అమెరికా కంపెనీలకు అక్కడ ప్రవేశం ఉండేది కాదు. ఇప్పుడు టారిఫ్ వ్యవస్థతో అది సాధ్యమవుతోంది" అని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా రెండు దేశాల మధ్య టారిఫ్‌లు తగ్గించి, వ్యాపార సంబంధాలు మెరుగుపడే అవకాశం ఉందని ట్రంప్ వ్యాఖ్యానించారు. "జూలై 31 తర్వాత ఆగస్ట్ 1నుంచి మాకు భారీ ఆదాయం వస్తుంది. ఇప్పటివరకు మేము $100 బిలియన్లకు పైగా పొందాము. ఆటోమొబైల్, స్టీల్ వంటి రంగాల్లో టారిఫ్‌లు అమలయ్యాయి. భారత్‌తో మేము చాలా దగ్గరలో ఉన్నాం" అని చెప్పారు.

భారత ప్రభుత్వ వర్గాల ప్రకారం, ప్రస్తుతం ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఐదవ రౌండ్ చర్చలు అమెరికాలో జరుగుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ, ట్రంప్ తీసుకున్న నిర్ణయాల మేరకు ఈ చర్చలు ముందుకెళ్తున్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.